E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD | సంపుటి :01 | సంచిక :233 | ఆదివారం 02 ఆగస్టు 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-

## పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తుల తేదీలు ఖరారు!



ఆగస్టు 19 నుంచి అప్లికేషన్లు

సెప్టెంబర్ 9 వరకు గడువు

7,437 పోస్టుల భర్తీ

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు

## తరచూ ఎన్నికలతో నష్టమెంత?

పరిశ్రమల నష్టాలపై సర్వే

సీఐఐతో వివరాల సేకరణ

జమిలి ఎన్నికలపై కీలక అధ్యయనం

ప్రాజెక్టుల ఆలస్యంపై ఆరా

ఉత్పాదకత నష్టంపై లెక్కలు

ఎన్నికల ప్రభావంపై నివేదిక




**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (తెలుగు గళం):** దేశంలో తరచూ జరుగుతున్న ఎన్నికల వల్ల వ్యాపారాలు, పరిశ్రమలపై పడుతున్న ఆర్థిక నష్టంపై ఒకే దేశం.. ఒకే ఎన్నికలు' పై ఏర్పడిన ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ దృష్టి సారించింది. వివిధ రాష్ట్రాల్లో తరచూ ఎన్నికలు జరగడం వల్ల అది ఆయా ప్రాజెక్టులు, పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు బ్రేకులు పడుతోందనే అభిప్రాయాలు చాలా కాలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో తరచుగా జరిగే ఎన్నికల వల్ల వ్యాపార కార్యకలాపాలు, కార్మికుల లభ్యత, పెట్టుబడి నిర్ణయాలు, ప్రభుత్వ అనుమతులపై పడే ప్రభావాన్ని లెక్కించాలని పరిశ్రమలను తాజాగా కోరింది .

**సీఐఐ సర్వే.. వివరాల సేకరణ:**

ఈ మేరకు 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' వంటి పారిశ్రామిక సంఘాలు దేశవ్యాప్తంగా ఉన్న తమ సభ్య కంపెనీలకు ప్రత్యేక సర్వే ఫారమ్‌లను పంపాయి. ఎన్నికల కోడ్ అమలులోకి రావడం వల్ల ప్రభుత్వ అనుమతులు, టెండర్ల రద్దు లేదా వాయిదా, భూసేకరణ, పర్యావరణ అనుమతులు, ప్రభుత్వ బిల్లుల చెల్లింపుల్లో జరిగే ఆలస్యం వల్ల పరిశ్రమలు ఎదుర్కొంటున్న నష్టాలను ఈ సర్వే ద్వారా సేకరిస్తున్నారు.

## అజిత్ దోవల్‌కు లోక్‌మాన్య తిలక్ అవార్డు

అమిత్ షా చేతుల మీదుగా సత్కారం

పూణేలో అవార్డు ప్రదానం

దేశ భద్రత సేవలకు గుర్తింపు

తిలక్ వర్ధంతి సందర్భంగా పురస్కారం

రూ.1 లక్ష నగదు బహుమతి

దౌత్య సేవలకు ప్రశంసలు

2లో

## రాష్ట్రాలకు కేంద్రం భారీ వరం

రూ.1.09 లక్షల కోట్లు విడుదల

రాష్ట్రాలకు ముందస్తు నిధుల బదిలీ

తెలుగు రాష్ట్రాలకు భారీ వాటా

ఏపీకి 4,597 కోట్లు..

తెలంగాణకు 2,370 కోట్లు

సంక్షేమ పథకాలకు నిధుల బలం



**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (తెలుగు గళం):** రాష్ట్రాల ఆర్థిక స్థితిని మరింత బలపరిచేందుకు మరియు మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర పన్నుల వాటా కింద దేశంలోని అన్ని రాష్ట్రాలకు కలిపి ఒక్కసారిగా రూ. 1,09,019 కోట్లను విడుదల చేసింది. సహజంగా ప్రతీ నెలా ఇచ్చే గడువు (ఆగస్టు 10) కంటే ముందే ఈ అదనపు వాటాను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేయడం విశేషం.

## నాకు నచ్చిన వీడియో షేర్ చేస్తా.. తప్పా: అంబటి రాంబాబు

తనపై కేసులకు భయపడనన్న మాజీ మంత్రి

వీడియో అసభ్యం కాదు.. పొలిటికల్ కార్టూన్

అరెస్ట్ వెనుక కుట్ర ఉందని ఆరోపణలు

చట్టం అందరికీ ఒకేలా ఉండాలని డిమాండ్

తన అభియోగాలపై విచారణ కోరిన అంబటి

ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తానని స్పష్టం

2లో

## ఎస్ఆర్ఎస్పీని పరిశీలించిన మంత్రులు

ప్రాజెక్టును సందర్శించిన ఉత్తమ్

శ్రీధర్‌బాబుతో కలిసి పరిశీలన

పూడికతీతపై త్వరలో ప్రణాళిక

నీటి విడుదలపై రెండు రోజుల్లో నిర్ణయం

బీఆర్ఎస్‌పై ఉత్తమ్ విమర్శలు

బ్యారేజీల పునరుద్ధరణకు హామీ

2లో



# ఉత్తరాంధ్రకు రెక్కలు

**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (తెలుగు గళం):** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరుస్తూ నూతనంగా నిర్మించిన 'భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం' ప్రాంగణానికి ప్రధాని నరేంద్ర మోడీ చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రధానికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ అధికారికంగా రిబ్బన్ కట్ చేసి, విమానాశ్రయ టెర్మినల్‌ను ప్రారంభించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రధానితో కలిసి ప్రాజెక్టు విశేషాలను పరిశీలించారు. అలాగే ప్రాజెక్టు పూర్తి వివరాలు జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు ప్రధానికి వివరించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో అక్కడే ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రధాని వెళ్లారు. అలాగే సంప్రదాయ గిరిజన ధింసా నృత్యాన్ని ప్రధాని మోడీ తిలకించారు. అనంతరం సభ వేదికపై నుంచి భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

భోగాపురానికి మోడీ గ్రీన్ సిగ్నల్

ఉత్తరాంధ్ర కలకు రెక్కలు

రూ.4,700 కోట్లతో ఎయిర్‌పోర్ట్

రిబ్బన్ కట్ చేసి జాతికి అంకితం

చంద్రబాబు--పవన్‌తో మోడీ సందడి

ఏటా 60 లక్షల ప్రయాణికుల సామర్థ్యం

ఉత్తరాంధ్రకు కొత్త గ్రోత్ ఇంజిన్

రూ.18 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం

'స్వర్ణాంధ్ర' విజన్‌కు శుభారంభం

## స్పెయిన్‌లోకి వలసదారుల వెల్లువ!

24 గంటల్లో 60 వేల మంది ప్రవేశం

తొక్కిసలాటలో 57 మంది మృతి

సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితి

మొరాకో నుంచి భారీ వలసలు

అదనపు బలగాల మోహరింపు

అక్రమ ప్రవేశాలపై కఠిన చర్యలు



**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (తెలుగు గళం):** తమ ఉనికిని చట్టబద్ధం చేసుకుని నివాస హక్కులు పొందవచ్చనే ఆశతో ఉత్తర ఆఫ్రికా దేశమైన మొరాకో నుంచి వేలాది మంది వలసదారులు స్పెయిన్‌కు చెందిన సెంయుటా ప్రాంతంలోకి దండయాత్రగా తరలివచ్చారు. కేవలం 24 గంటల వ్యవధిలోనే ఏకంగా...

## ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్!



ఈ వారాంతంలోనే దాడుల హెచ్చరిక

అమెరికా బలగాలకు గ్రీన్ సిగ్నల్?

యుద్ధ సన్నాహాల్లో వైమానిక దళాలు

పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

ఇరాన్ వైఖరి మారకపోతే ప్రతీకారం

## వాణిజ్య పన్నుల శాఖకు రికార్డు ఆదాయం!

జులైలో రూ.7,865 కోట్ల వసూళ్లు

ఆల్‌టైమ్ రికార్డు నమోదు

జీఎస్టీ వృద్ధిలో రెండో స్థానం

19 శాతం ఆదాయ వృద్ధి

పన్ను ఎగవేతపై ఉక్కుపాదం

165 బోగస్ కేసుల గుర్తింపు




**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సరికొత్త రికార్డు సృష్టించింది. జులై 2026 నెలలో అత్యధికంగా రూ.7,865 కోట్ల ఆదాయాన్ని సేకరించి, ఇప్పటివరకు ఒక్క నెలలో వచ్చిన గరిష్ట ఆదాయంగా కొత్త చరిత్ర నమోదు చేసింది.

## 11,403 బ్యాంక్ క్లర్క్ పోస్టుల భర్తీ!




తెలంగాణలో 191.. ఏపీలో 186 పోస్టులు

డిగ్రీ అర్హతతో దరఖాస్తుకు అవకాశం

ఆగస్టు 21 వరకు అప్లికేషన్లు

రూ.24 వేల నుంచి రూ.64 వేల వరకు వేతనం

అక్టోబర్‌లో ప్రిలిమ్స్.. డిసెంబర్‌లో మెయిన్స్

# ఉత్తరాంధ్రకు రెక్కలు..భోగాపురానికి మోడీ గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

అంతకు ముందు ప్రధాని మోడీకి స్టేజిపై సీఎం చంద్రబాబు నాయుడు సత్కరించారు.

అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. రికార్డు సమయంలో దేశంలోని అత్యాధునిక విమానాశ్రయాన్ని నిర్మించుకున్నామని, ఇది ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు విజన్ వల్లే సాధ్యమైందని ఏపీ అభివృద్ధికి ఉత్తరాంధ్ర నుంచే అడుగులు పడ్డాయని, రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా తెలిపారు.

మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్రలో ఉత్సాహం అధిరిపోయిందని, ఎయిర్ పోర్టును వ్యతిరేకించిన నాయకులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ విజన్ తోనే ఉత్తరాంధ్ర గొప్పతనం ప్రపంచానికి తెలుస్తుందని, ఈ ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర భవిష్యత్ మారిపోతుందని, అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. అలాగే భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన రైతులకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాష్ట్ర విభజన తర్వాత కట్టుబట్టలతో ఆంధ్ర రాష్ట్రంలోకి వచ్చిన తమను కేంద్రంలోని ప్రధాని మోడీ తమను ఆదుకున్నారని, రాష్ట్రంలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికి డబుల్ ఇంజన్ ప్రభుత్వ సహకారంతో అభివృద్ధిలో దూసుకుపోతున్నామని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ గుర్తు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమైన భోగాపురం (అల్లూరి సీతారామరాజు) అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ నమూనాలో జిఎంఆర్ గ్రూప్ ద్వారా సుమారు 4,700 కోట్ల కంటే ఎక్కువ వ్యయంతో నిర్మించారు. విజయనగరం జిల్లా భోగాపురంలో మొత్తం 2,703 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టులో ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో పాటు ఎవియేషన్ హబ్, ఎవియేషన్ యూనివర్సిటీలు భాగస్వామ్యమై ఉన్నాయి. ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యంతో ప్రారంభమయ్యే ఈ విమానాశ్రయ టెర్మినల్‌ను భవిష్యత్తులో 4 కోట్ల వరకు విస్తరించేలా డిజైన్ చేశారు. 3,800 మీటర్ల పొడవైన విస్తృత రన్‌వే, 25,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ప్రత్యేక కార్గో టెర్మినల్, అధునాతన డిజియాత్ర సాంకేతికతలతో నిర్మించిన ఈ ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్ర పరిధిలోని పరిశ్రమలు, విదేశీ ఎగుమతులు మరియు పర్యాటక రంగానికి ప్రధాన వృద్ధి చక్రం గా మారనుంది.

# ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్!

**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (తెలుగు గళం):** పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు మరింత దట్టంగా అలుముకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై దాడికి సిద్ధమవుతున్నట్లు తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ వైఖరి మారకపోతే ఈ వారాంతంలోనే ఆ దేశంపై భారీ స్థాయిలో ప్రతీకార దాడులు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇరాన్ దాడులను, చర్యలను తీవ్రతరం చేస్తే.. ఇంతకుముందు ఎన్నడూ చూడని రీతిలో అమెరికా బలగాలు ప్రతీకారం తీర్చుకుంటాయని ట్రంప్ హెచ్చరించారు.

యుద్ధసన్నద్ధత..

అమెరికా వైమానిక దళాలు, యుద్ధ నౌకలు ఇప్పటికే రంగంలోకి దిగాయని, దాడులకు సంబంధించిన తుది ఆదేశాల కోసం సర్వసన్నద్ధంగా ఉన్నాయని వార్తలు వెలువడుతున్నాయి. ఇరాన్ కొత్త నాయకత్వం (మొజబా ఖమేనీ), అమెరికా- ఇజ్రాయెల్ కూటమి మధ్య నెలకొన్న వివాదాలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఇరుపక్షాలు రాజీ పడకపోవడంతో ప్రాంతీయ శాంతికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. అమెరికా సైనిక వర్గాల నుంచి ఏ క్షణంలోనైనా వైమానిక దాడుల ప్రకటన రావచ్చనే వార్తలతో అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

# స్పెయిన్‌లోకి వలసదారుల వెల్లువ!

మొదటి పేజీ తరువాయి

60,000 మంది సరిహద్దులు దాటి తమ భూభాగంలోకి ప్రవేశించినట్లు స్పెయిన్ అధికారులు వెల్లడించారు. సముద్ర మార్గం గుండా ఈదుకుంటూ, సరిహద్దు కంచెలను దాటే క్రమంలో చోటుచేసుకున్న తొక్కిసలాట, ప్రమాదాల కారణంగా కనీసం 57 మంది వలసదారులు ప్రాణాలు కోల్పోయారు. దారితప్పిన గుంపును అదుపుచేసే క్రమంలో భద్రతా బలగాలకు, వలసదారులకు మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకోవడంతో సరిహద్దుల వద్ద రణరంగం నెలకొంది.

ఈ ఊహించని పరిణామంపై స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సరిహద్దును దాటడాన్ని దేశ సార్వభౌమాధికారానికి భంగంగా అభివర్ణించిన ఆయన, అక్కడి పరిస్థితులను వెంటనే అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అదనపు మిలిటరీ, పోలీసు బలగాలను ఘటనా స్థలానికి తరలించామని స్పష్టం చేశారు. మానవ అక్రమ రవాణా ముఠాలు వలసదారులకు తప్పుడు ఆశలు చూపి ప్రమాదంలోకి నెట్టాయని, శాంతిభద్రతలను పునరుద్ధరించి చట్టవ్యతిరేకంగా ప్రవేశించిన వారిని తిరిగి పంపించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని ఈ సందర్భంగా స్పెయిన్ ప్రధాని వెల్లడించారు.

# 11,403 బ్యాంక్ క్లర్క్ పోస్టుల భర్తీ!

**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (తెలుగు గళం):** బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం సాధించాలనుకునే అభ్యర్థులకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) తీపి కబురు అందించింది. దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న సుమారు 11,403 బ్యాంక్ క్లర్క్ పోస్టుల భర్తీకి భారీ ఉద్యోగ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ మొత్తం ఖాళీలలో తెలంగాణలో 191 పోస్టులు, ఆంధ్రప్రదేశ్‌లో 186 పోస్టులు అందుబాటులో ఉన్నాయి. ఏదైనా రికగ్నైజ్డ్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

ఈ పోస్టులకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమవ్వగా, ఈ నెల 21వ తేదీ వరకు అప్లై చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అభ్యర్థుల వయస్సు 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.175, ఇతర కేటగిరీల అభ్యర్థులకు రూ.850 దరఖాస్తు రుసుముగా నిర్ణయించినట్లు ఐబీపీఎస్ తెలిపింది. ఎంపికైన అభ్యర్థులకు రూ.24,000 నుంచి రూ.64,000 వరకు పే-స్కేల్ లభిస్తుంది. అక్టోబర్‌లో ప్రిలిమినరీ పరీక్షలు, డిసెంబర్‌లో మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తామని, అర్హులైన అభ్యర్థులు గడువులోగా అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# రాష్ట్రాలకు కేంద్రం భారీ వరం



**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (తెలుగు గళం):** రాష్ట్రాల ఆర్థిక స్థితిని మరింత బలపరిచేందుకు మరియు మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర పన్నుల వాటా కింద దేశంలోని అన్ని రాష్ట్రాలకు కలిపి ఒక్కసారిగా రూ. 1,09,019 కోట్లను విడుదల చేసింది. సహజంగా ప్రతీ నెలా ఇచ్చే గడువు (ఆగస్టు 10) కంటే ముందే ఈ అదనపు వాటాను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేయడం విశేషం. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాల వద్ద తగినంత నిధుల లభ్యత పెరిగి, అభివృద్ధి ప్రాజెక్టులు మరియు సంక్షేమ పథకాలు మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం కలుగుతుంది.

తెలుగు రాష్ట్రాలకు వచ్చిన వాటా..

పన్నుల వాటా కింద ఏపీకి రూ. 4,597 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణ రాష్ట్రానికి రూ. 2,370 కోట్లు కేటాయించారు. కేంద్రం నుంచి అదనపు వాటా ముందుగానే అందడంతో తెలుగు రాష్ట్రాలు తీవ్ర నిధుల సమస్య నుంచి ఉపశమనం పొందే అవకాశముంది. మూలధన వ్యయం పెంచడానికి, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరాయంగా అమలు చేయడానికి ఈ నిధులు ఎంతగానో దోహదపడతాయని కేంద్రం తెలిపింది.

# వాణిజ్య పన్నుల శాఖకు రికార్డు ఆదాయం!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్థిక పురోగతి, మెరుగైన పన్ను నిబంధనల అమలు, శాఖ చేపడుతున్న పటిష్టమైన చర్యల వల్ల ఈ ఘనత సాధ్యమైంది.

సరికొత్త ఆల్-టైమ్ రికార్డు..

గతంలో ఏప్రిల్ 2026లో వచ్చిన 77,598 కోట్ల రాబడియే ఇప్పటివరకు అత్యధికం కాగా, ఈ జులైలో సేకరించిన 77,865 కోట్లతో ఆ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. జులై 2025లో వచ్చిన 76,624 కోట్లతో పోలిస్తే, ఈసారి రూ. 1,241 కోట్లు (19% వృద్ధి) అదనంగా ఆదాయం సమకూరింది. మొత్తం రాబడిలో జీఎస్టీ ఆదాయమే రూ. 4,452 కోట్లుగా ఉంది. గతేడాది జులై (73,638 కోట్లు)తో పోలిస్తే జీఎస్టీ వృద్ధిలో ఏకంగా 22% పెరుగదల కనిపిస్తోంది. తెలంగాణలోని పన్ను చెల్లింపుదారుల నుండి వసూలైన మొత్తం జీఎస్టీటీ రాబడి (IGST, CGST, SGST కలిపి) 75,819 కోట్లకు చేరింది. జులై నెల జీఎస్టీ వృద్ధిరేటు (19%) విషయంలో దేశంలోనే హర్యానా తర్వాత తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. అఖిల భారత సగటు వృద్ధిరేటు 10%గా మాత్రమే ఉంది. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడం, కొత్త పెట్టుబడులు రావడం, వినియోగం పెరగడమే కాకుండా.. పన్ను ఎగవేతదారులపై సాంకేతికత సాయంతో కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఈ రాబడి సాధ్యమైందని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ ఎమ్. రఘునందన్ రావు తెలిపారు.

రూ.7300 కోట్ల నకిలీ ఐటీసీ స్కామ్ గుర్తింపు..

జూలై నెలలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో సరఫరా లేకుండానే బోగస్ బిల్లులతో రూ. 300 కోట్ల మేర ఇన్పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ ) పొందేందుకు యత్నించిన 165 మంది. పన్ను చెల్లింపుదారులను గుర్తించి, వారి రిజిస్ట్రేషన్లను సస్పెండ్ చేయడం వంటి చట్టపరమైన చర్యలు చేపట్టారు. సక్రమంగా పన్ను చెల్లించే వారిని గౌరవిస్తూనే, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేసే వారిపై జీఎస్‌ఓటీ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు. సకాలంలో పన్నులు చెల్లించిన 4,61,276 మంది తెలంగాణ పన్ను చెల్లింపుదారులకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తుల తేదీలు ఖరారు!




**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి (టీఎస్ఎల్పిఆర్బి) పోలీసు, ఎస్పిఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో ఖాళీగా ఉన్న 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి కీలక అప్ డేట్ వెలువడింది. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ తేదీలను వెల్లడించింది. అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 19వ తేదీ ఉదయం 8:00 గంటల నుండి సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు అధికారిక వెబ్‌సైట్ www.tgprb.in లో దరఖాస్తులు చేసుకోవచ్చని బోర్డు చైర్మన్ వి. వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. దరఖాస్తులను కేవలం ఆన్ లైన్ లో మాత్రమే సమర్పించాల్సి ఉంటుందని ఇతర రూపాల్లో వచ్చే దరఖాస్తులను తిరస్కరించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

ఇటీవలే నోటిఫికేషన్ రిలీజ్:

పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఫైర్, ఎమర్జెన్సీ, జైలు విభాగాల్లో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి సంబంధించిన మొత్తం నాలుగు నోటిఫికేషన్లను టీఎస్ఎల్పిఆర్బి గత నెల 29వ తేదీన విడుదల చేసింది. అయితే దరఖాస్తుల ప్రారంభానికి సంబంధించిన ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో తాజాగా దరఖాస్తుల తేదీలను ప్రకటించింది.

వన్ టైమ్ ఫీజు:

పరీక్ష రుసుముకు సంబంధించి, మొత్తం నియామక ప్రక్రియ ముగిసే వరకు (దరఖాస్తు రుసుము, ప్రాథమిక రాత పరీక్ష, ఫిజికల్ మెజర్‌మెంట్/ఎఫిషియెన్సీ టెస్టులు, తుది రాత పరీక్ష మరియు బయోమెట్రిక్స్ వంటి అన్ని దశలకు) అభ్యర్థులు ఒక్కసారి మాత్రమే ఈ 'వన్-టైమ్ ఫీజు' చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సై, సబ్ ఇన్ స్పెక్టర్ స్థాయి పోస్టులు (సివిల్, ఏఆర్, టీజీఎస్పీ, సార్పిపిఎల్, ఎస్పీఎఫ్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ జైలర్, ఏఎస్సై ఎఫ్‌పీబీ)లకు తెలంగాణకు చెందిన స్థానిక ఎస్సి మరియు ఎస్టీ అభ్యర్థులకు పరీక్ష రుసుము రూ. 750 , ఇతర అభ్యర్థులందరికీ (ఓసీ, బీసీ మరియు ఇతరులు) రూ.1,500గా నిర్ణయించారు. అలాగే కానిస్టేబుల్, ఫైర్‌మేన్, వార్డర్, ఇతర డ్రైవర్, మెకానిక్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే స్థానిక ఎస్సి/ఎస్టీ అభ్యర్థులకు రుసుము రూ.600 కాగా, ఇతర అభ్యర్థులందరికీ రూ.1,200గా నిర్ణయించారు.

# అజిత్ దోవల్‌కు లోక్‌మాన్య తిలక్ అవార్డు




**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (తెలుగు గళం):** జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డు వరించింది. ఈ అవార్డును కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా పూణేలో అందజేశారు. బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా అవార్డు ప్రదానం చేశారు. దేశ భద్రత, కౌంటర్ టెర్రరిజం, సరిహద్దు భద్రతలో సేవలకు ఈ అవార్డును అందజేస్తారు. అవార్డులో మెమెంటో, ప్రశంసాపత్రం, రూ.1 లక్ష నగదు బహుమతి ఉంటుంది. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు ఏక్‌నాథ్ షిండే, సునేత్ర పవార్ పాల్గొన్నారు.

ఇదిలా ఉంటే దేశ భద్రత, దౌత్యం, ఇంటెలిజెన్స్ రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న అజిత్ దోవల్ భారత రక్షణ వ్యవస్థలో కీలక పాత్ర పోషించారు. ఆపరేషన్ బ్లాక్ థండర్, డోక్లామ్ వివాదంలో ఆయన వ్యూహాత్మక దౌత్య చర్చలు, బాలాకోట్ వైమానిక దాడుల వెనక ఆయన వ్యూహంపై ప్రశంసలు కురిశాయి. ఈయన 1968 కేరళ కేడర్ కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి కాగా మూడు దశాబ్దాలకు పైగా భారత ఇంటెలిజెన్స్ లో పనిచేశారు. తరవాత ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ గా వ్యవహరించారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలతో పాటు, లండన్, ఇస్లామాబాద్ లలో భారత దౌత్య కార్యాలయాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు.


# ఎస్ఆర్ఎస్పీని పరిశీలించిన మంత్రులు



**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (తెలుగు గళం):** రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ (ఎస్ఆర్ఎస్పీ) ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. అధికారులతో కలిసి ప్రాజెక్టు వద్దకు చేరుకున్న మంత్రులు జలాశయంలో ప్రస్తుత నీటి మట్టం వివరాలను, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహ పరిస్థితిని ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని, ప్రాజెక్టులోని పూడికతీతపై త్వరలోనే స్పష్టమైన ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. అలాగే ఆయకట్టుకు నీటి విడుదలపై రాబోయే రెండు రోజుల్లో స్పష్టత ఇస్తామని వెల్లడించారు.

ఇదే సమయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దెబ్బతిన్న ఆ మూడు బ్యారేజీలను పునరుద్ధరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, దానిపై కూడా బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన డ్యామ్‌లు 60 ఏళ్లైనా చెక్కుచెదరకుండా బలంగా నిలిచాయని, కానీ బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులు మాత్రం కొద్ది కాలానికే దెబ్బతిన్నాయని మంత్రి ఉత్తమ్ విమర్శించారు.

# నాకు నచ్చిన వీడియో షేర్ చేస్తా.. తప్పా: అంబటి రాంబాబు



**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (తెలుగు గళం):** తనకు నచ్చిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తానని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. కేంద్రమంత్రి చంద్రశేఖర్‌పై తన ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన వీడియో అసభ్యకరం కాదని, పొలిటికల్ కార్టూన్ అని ఆయన తెలిపారు. తనపై కేసు నమోదు అయినట్లు తనకు తెలియదన్నారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. తన ఇంటిపై దాడి జరిగితే తననే అరెస్ట్ చేయడంలో కేంద్రమంత్రి చంద్రశేఖర్ కుట్ర ఉందని అంబటి ఆరోపించారు. కేంద్రమంత్రి చంద్రశేఖర్ నేరస్తుడు. నా అరెస్ట్ వెనుక ఆయన కుట్ర ఉంది. ఆయనే నా ఇంటిపై దాడి చేయించారు. నన్ను పోలీస్ స్టేషన్ లోకి తీసుకెళ్లిన తర్వాత పోలీసులకు ఫోనులు చేసి నన్ను హింసించమని వారికి చెప్పారు. చంద్రశేఖర్ అండతోనే హింసించే ప్రయత్నం చేశారు. కేంద్రమంత్రి అయినా, ఎవరైనా సరే చట్టవ్యతిరేకంగా పని చేశారు. దానిపై విచారణ జరపాలని నేను కోరా. విచారణ జరపలేదు. అందుకే నేను ఉద్యమం చేస్తున్నా. అందులో భాగంగానే పెమ్మసాని చంద్రశేఖర్ ను చట్టప్రకారం శిక్షించవల్సిందే. నా అభియోగాలపై విచారణ జరపాలి." అని అంబటి రాంబాబు డిమాండ్ చేశారు.

మాపైనా ట్రోల్స్ ... కేసులెందుకు పెట్టడంలేదు

"నాపైనా, జగన్ మోహన్ రెడ్డిపైనా వీడియోలు, పోస్టులు పెడుతున్నారు. మరి కేసులు ఎందుకు పెట్టడంలేదు. మా అందరినీ ట్రోల్స్ చేస్తున్నారు. చంద్రబాబు నాయకత్వంలో ఏఐ వీడియోలు రిలీజ్ చేస్తున్నారు. మరి కేసులు పెట్టారా..?. చట్టం ఆరకంగా నడుస్తోంది. ఆ వీడియోలను నేను క్రియేట్ చేశా. నాకు ఎవరూ పంపించలేదు. ఆ వీడియో, కార్టూన్ పట్ల నాకు బాధ్యత ఉంది. కేసులు పెడితే మైలేజ్ రాదు. కేసులకు భయపడను. మర్డర్లు, స్కాములు, దోపిడీలు చేశా. ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నా. ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదు." అని అంబటి రాంబాబు పేర్కొన్నారు.

# తరచూ ఎన్నికలతో నష్టమెంత?.. దేశవ్యాప్తంగా సర్వే ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్ట్ వ్యయం పెరగడం, కొత్త పెట్టుబడుల నిర్ణయాలు వాయిదా పడటం వంటి అంశాలపై కూడా స్పష్టమైన నివేదికలను కోరుతున్నారు. ఈ మేరకు గతంలో జరిగిన లోక్‌సభ, శాసనసభ, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వ్యాపార కార్యకలాపాలకు ఎంతమేర విఘాతం కలిగింది? ఎంత మొత్తం నష్టం వాటిల్లింది? అనే వివరాలను అంచనా వేసి పంపాలని జేపీసీ కోరింది. దేశవ్యాప్తంగా జమిలి (ఒకేసారి) ఎన్నికలు నిర్వహిస్తే ప్రాజెక్టుల నిర్వహణలో ఎంత శాతం పురోగతి ఉంటుంది? వ్యాపార సమర్థత ఎంత పెరుగుతుంది? దాని ద్వారా లభించే ఆర్థిక ప్రయోజనాల వివరాలను కూడా సమర్పించాలని జేపీసీ కంపెనీలను కోరింది.

ఉద్యోగుల సెలవులు, ఇతర రంగాల నష్టం!

ఇక ఎన్నికల సమయంలో ఓటింగ్ నిమిత్తం ఉద్యోగుల విధులకు హాజరుకాకపోవడం, ప్రయాణ పరిమితులు, భద్రతా ఆంక్షల వల్ల కోల్పోయిన పనిదినాలు, ఉత్పాదకత నష్టాన్ని కంపెనీలు సేకరిస్తున్నాయి. ఎన్నికలు, ఓట్ల లెక్కింపు సమయంలో మద్యం విక్రయాల నిషేధించడం వల్ల హోటళ్లు, పర్యాటక రంగానికి వస్తున్న రాబడి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ఇక ఉపాధ్యాయులను ఎన్నికల విధుల్లోకి తీసుకోవడం, పాఠశాల భవనాలను పోలింగ్ కేంద్రాలుగా ఉపయోగించడం వల్ల విద్యాబోధనకు కలిగే ఆటంకాలను కూడా సర్వేలో సేకరిస్తున్నారు.

# 'చందా చోరీ' స్కిట్ వివాదం రాహుల్ సహా పలువురిపై ఎఫ్ఐఆర్



**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (తెలుగు గళం):** అయోధ్య 'చందా చోరీ' స్కిట్ వివాదానికి దారి తీసింది. అయోధ్య విరాళాల చోరీపై పార్లమెంట్ ఆవరణలో విపక్ష సభ్యులు ప్రత్యేక స్కిట్ వేశారు. పప్పు యాదవ్ కాషాయ వస్త్రాలు ధరించి.. అయోధ్యలోని శ్రీరాముని ఫొటోను చేతిలో పట్టుకుని.. భక్తుల నుంచి కానుకలు స్వీకరిస్తున్న ఆలయ పూజారిగా నటిస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ప్రదర్శన ఇప్పుడు వివాదంగా మారింది. కొందరు సాధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాహుల్ గాంధీ సహా పలువురిపై కేసు నమోదైంది.

అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాల్లో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందంటూ పార్లమెంట్ వెలుపల ఇండియా కూటమి నేతలు నిర్వహించిన నిరసనపై సాధు సమాజం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించిన తీరు సనాతన ధర్మాన్ని అవమానించేలా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని సాధు సమాజం సభ్యులు హెచ్చరించారు.

కాశీ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌరవ్ బన్స్వాల్ మాట్లాడుతూ.. ఈ ఘటనపై కోత్వాలి పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు అందిందని తెలిపారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని వీడియోలకు సంబంధించి ఫిర్యాదు నమోదైనట్లు చెప్పారు. ఆ వీడియోల్లో పప్పు యాదవ్ సాధువు వేషధారణలో కనిపిస్తూ.. సనాతన ధర్మాన్ని అవమానించేలా కొన్ని చర్యలకు పాల్పడ్డారని ఫిర్యాదుదారులు ఆరోపించినట్లు వెల్లడించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేస్తున్నామని, తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ గౌరవ్ బన్స్వాల్ తెలిపారు. ఘటనకు సంబంధించిన వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించిన తర్వాత దర్యాప్తును ముందుకు తీసుకెళ్లనున్నట్లు సమాచారం.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్న సమయంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. అయోధ్య రామమందిర విరాళాల సేకరణలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంట్‌లోని మకర ద్వారం సమీపంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా ఇటీవల ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు తీసుకున్న చర్యలపై కూడా అమిత్ షా స్పందించాలని ప్రతిపక్ష సభ్యులు కోరారు. పార్లమెంట్ ప్రాంగణంలో "చందా చోర్, గద్దీ ఛోడ్", "జవాబ్ తుమ్‌కో దేనా హోగా", "అమిత్ షా, సదన్ మే ఆవో" అంటూ నినాదాలు చేశారు. పూర్ణియా ఎంపీ పప్పు యాదవ్ కాషాయ వస్త్రాలు ధరించి ఈ నిరసనలో పాల్గొన్నారు. ఆలయ పూజారి పాత్రను పోషిస్తూ.. భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అయోధ్య రామమందిరానికి సంబంధించిన శ్రీరాముడి చిత్రాన్ని కూడా ఆయన చేతిలో పట్టుకున్నారు. పప్పు యాదవ్ ప్రదర్శించిన ఈ స్కిట్ సనాతన ధర్మాన్ని అవమానించేలా ఉందని సాధు సమాజం ఆరోపించడంతో వివాదం చెలరేగింది.

ఈ ఘటనపై రాహుల్ గాంధీ, పప్పు యాదవ్, అవధేశ్ ప్రసాద్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై సంబంధిత నేతలు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# ఆగస్టు 10 జైల్ భరోను జయప్రదం చేయండి

## ● సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం పిలుపు



తెలుగు గళం న్యూస్ జనగామ, ఆగస్టు 1

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ కాచం కృష్ణమూర్తి స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించే దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా చందు నాయక్ పిలుపునిచ్చారు.జనగామ పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టణ సదస్సుకు సీఐటీయూ పట్టణ కన్వీనర్ బూడిద ప్రశాంత్, తెలంగాణ రైతు సంఘం పట్టణ కార్యదర్శి మంగ బీరయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బొట్టు సూరయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాపర్తి రాజు, భూక్యా చందు నాయక్ పాల్గొని ప్రసంగించారు.వక్తలు మాట్లాడుతూ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. అమెరికా నుంచి మక్కజొన్న, పత్తి, పాలు, చేపలు తదితర వ్యవసాయ ఉత్పత్తులను సున్నా సుంకంతో దిగుమతి చేసుకునే నిర్ణయం దేశ రైతాంగానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు.కార్మికులు దశాబ్దాల పోరాటంతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక నియమావళులను అమలు చేయడం కార్మిక హక్కులపై దాడి అని ఆరోపించారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలు గ్రామీణ పేదల జీవనోపాధికి ప్రమాదకరమని అన్నారు.దేశ సంపద, గనులు, అడవులు, సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడంతో పాటు విద్యుత్ రంగాన్ని కూడా ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే దిశగా అడుగులు వేస్తోందని విమర్శించారు.ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిస్తూ, ఆగస్టు 6న మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించడం, ఆగస్టు 10న తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ జైల్ భరో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పొత్కనూరి ఉపేందర్, సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం నాయకులు చిర్ర శ్రీను, బూడిద సంపత్, బూడిద ఉపేందర్, బొల్లం దయాసాగర్, నరేందర్, కర్రె సిద్దయ్య, ఎండి ఫక్రుద్దీన్, కౌడా ఆంజనేయులు, కర్రె సిద్ధులు, మోటే నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మేడబోయిన సాయి వర్ధన్ జ్ఞాపకార్థం మహా అన్నదానం

తెలుగు గళం న్యూస్
జనగామ,ఆగస్టు 1



జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడబోయిన సాయి వర్ధన్ జ్ఞాపకార్థం ఆయన తల్లి సోదరి మేడబోయిన లక్ష్మీనరసమ్మ శిరీష ఆధ్వర్యంలో జనగామ జిల్లా ఏరియా ఆసుపత్రి వద్ద వైద్యం కోసం వచ్చిన రోగులు, వారి సహాయకులకు మహా అన్నసమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రధాన కార్యదర్శి వంగ భీమ్‌రాజ్ మాట్లాడుతూ మేడబోయిన సాయి వర్ధన్ కుటుంబ సభ్యులు చేపట్టిన ఈ సేవా కార్యక్రమం ఆదర్శనీయమని కొనియాడారు. దేశంలో ఆకలితో ఎవరూ బాధపడకుండా చూడడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. నిరాశ్రయులు, అనాథలు, నిరుపేద కుటుంబాలు, ఆకలితో ఉన్న వారికి ఆహారం, తాగునీరు అందించడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవాలని ప్రజలకు, ముఖ్యంగా యువతకు పిలుపునిచ్చారు. ఈ మహా అన్న సమర్పణ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కోయాడ రవి, కుంచన సుప్రీం, కందుకూరి హరీష్, సుమన్ బ్లెస్సి, కోయాడ విశ్వ, పిట్టల కృష్ణ, చిద్దిరాల చందు, ఉల్లెంగుల మణి తదితరులు పాల్గొని సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మేడబోయిన సాయి వర్ధన్ కి ఘనంగా నివాళులర్పించారు.




# ఆగస్టు 6న ఇందిరాపార్క్ మహాధర్నాను జయప్రదం చేయండి

## ● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ




తెలుగు గళం న్యూస్ జఫర్‌ఘడ్, ఆగస్టు 1

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్రానికి పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ పిలుపునిచ్చారు.జఫర్‌ఘడ్ మండలంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత రెండేళ్లుగా లక్షలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిందని ఆరోపించారు. దీంతో వేలాది మంది విద్యార్థులు కళాశాలలకు ఫీజులు చెల్లించలేక చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రానికి ఇప్పటికీ పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి లేకపోవడం వల్ల విద్యారంగం అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని, ఈ ధర్నాను విజయవంతం చేయాలని ఆమె కోరారు.అనంతరం జరిగిన మహాసభలో 12 మంది సభ్యులతో కూడిన నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లవకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు సాత్విక్ రెడ్డి, నాయకులు హర్షిత్, నర్సింహా, శివ, సంజన, వెన్నెల, విక్కీ, మహేష్, సబీర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రధాన డిమాండ్లు

- రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
- రాష్ట్రానికి పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి.
- ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల పెంపును అరికట్టాలి.
- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ఉద్యోగాల క్యాలెండర్ విడుదల చేయాలి.

# పుట్టిన బిడ్డకు తల్లిపాలే ఆరోగ్యకరం :ఐసిడిఎస్ సూపర్వైజర్లు

తెలుగు గళం న్యూస్
భూపాలపల్లి రేగొండ



పుట్టిన పిల్లలకు తల్లిపాలు పట్టడం వల్ల శారీరక,మానసిక ఎదుగుదలతో పాటు ఆరోగ్యం, చురుకుదనం పెరుగుతాయని సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్) సూపర్‌వైజర్లు రజిత,సరోజన పేర్కొన్నారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల పరిధిలోని తిరుమలగిరి అంగన్‌వాడీ కేంద్రంలో రేగొండ సెక్టర్ అంగన్‌వాడీ ఉపాధ్యాయులతో కలిసి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు వాసవి,కల్పన,రజితల ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు.అనంతరం ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలల పాటు తప్పనిసరిగా కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నామాల రజిత,బోట్ల విమల,బండి ఉమామహేశ్వరి,ఏడెల్లి సునీత,కొంకాల పుష్పలత,మాడగాని సుజాత,మెతుకుపెల్లి దేవేంద్రతో పాటు సెక్టర్ పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజిద్ అఫ్సర్‌కు తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ జనగామ జిల్లా శాఖ ఘన సన్మానం



జనగామ, ఆగస్టు 1 (తెలుగుగళం)

## ● మైనారిటీల సంక్షేమానికి మూడు దశాబ్దాల సేవలకు గుర్తింపు

మైనారిటీల సంక్షేమం, విద్యాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లో గత 30 సంవత్సరాలుగా విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ సామాజిక సేవకులు మాజిద్ అఫ్సర్‌ను తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ (టీఎస్ఎంఈఎస్ఏ) జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా టీఎస్ఎంఈఎస్ఏ జనగామ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అంకుషావలి మాట్లాడుతూ, మాజిద్ అఫ్సర్ మూడు దశాబ్దాలుగా మైనారిటీల అభ్యున్నతి కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న వ్యక్తులను గుర్తించి సన్మానించడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మైనారిటీల సంక్షేమం కోసం తమ వంతు బాధ్యతగా సేవలు అందించాలని పిలుపునిచ్చారు.సన్మానానికి స్పందించిన మాజిద్ అఫ్సర్ మాట్లాడుతూ, ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. భవిష్యత్తులో కూడా మైనారిటీల సంక్షేమం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. తన సేవలను గుర్తించి సన్మానించిన టీఎస్ఎంఈఎస్ఏ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం మహ్మద్ తహసీన్, మహ్మద్ అఫ్జల్, మహ్మద్ ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ, మాజిద్ అఫ్సర్ అనేక సేవా కార్యక్రమాల ద్వారా మైనారిటీల అభ్యున్నతికి విశేష కృషి చేశారని ప్రశంసించారు.భవిష్యత్తులో కూడా ఆయన మరిన్ని సేవా కార్యక్రమాల్లో ముందుండాలని, అల్లాహ్ వారికి మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించి మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మాజిద్ అఫ్సర్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మహ్మద్ అంకుషావలి, మహ్మద్ తహసీన్, మహ్మద్ అఫ్జల్, మహ్మద్ ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురం సెక్టార్ లో పల్లె పల్లెన తల్లిపాల వారోత్సవాలు”

## పాల్గొన్న సిడిపిఓ సత్యవతి”

## అమ్మపాలెశీ లో పాల్గొన్న సర్పంచ్ పెద్దగౌళ్ల ప్రసన్న”




సత్తుపల్లి/వేంసూరు,ఆగస్టు01(తెలుగు గళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలోని ఐసీడీఎస్ వెంకటాపురం సెక్టార్ సూపర్ వైజర్ వసంతరాణి ఆధ్వర్యంలో లక్ష్మీ నారాయణపురం, అమ్మపాలెం గ్రామాలలో తల్లిపాల వారోత్సవాలు పల్లె పల్లెన చిన్నారులతో, గర్భిణీ బాలిశీత స్త్రీలతో చిన్నారుల తల్లులతో అంగన్వాడీ కేంద్రాలలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన సత్తుపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ సత్యవతి, అమ్మపాలెం గ్రామ సర్పంచ్ పెద్దగౌళ్ల ప్రసన్న లు మాట్లాడుతూ పాత పాలు వద్దు తల్లి పాలు ముద్దు అని తెలిపారు.బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని,06 నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత ముఖ్యంగా పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో: అంగన్వాడీ టీచర్స్ అబ్బదాసరి రోజా, రాధారాణి, గోధుమ నాగేంద్ర, ఆయాలు వాణి, రోజారమణి, సెకండ్ ఏఎన్ ఎం అరుణకుమారి, ఆశా వర్కర్ గౌడెల్లి లక్ష్మీకాంతమ్మ లు పాల్గొన్నారు.



# స్వరమాధురి ఎస్. జానకికి “స్వర నీరాజనం”

## -- మధుర గీతాలతో సంగీత నివాళి



తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 1

భారతీయ సినీ సంగీత రంగంలో తన అపూర్వ గానమాధుర్యంతో చిరస్థాయిగా నిలిచిన స్వరమాధురి స్వర్గీయ ఎస్. జానకి స్మృతికి నివాళిగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, ప్రజ్ఞా మెలోడీస్ సంయుక్త ఆధ్వర్యంలో “స్వర నీరాజనం” కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సోషల్ సర్వీస్ అండ్ యాక్టివిస్ట్ గంట శివ కల్యాణి మాట్లాడుతూ, ఎస్. జానకి 17 భారతీయ భాషల్లో 45 వేలకుపైగా పాటలు ఆలపించి భారతీయ సంగీత చరిత్రలో చెరగని ముద్ర వేశారని అన్నారు. ప్రతి పాటలో భావం, స్వరశుద్ధి, ఉచ్చారణ, వైవిధ్యాన్ని అద్భుతంగా పలికించిన ఆమె గాన ప్రస్థానం భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.జానకమ్మ లేని లోటు భారతీయ సంగీత రంగానికి ఎప్పటికీ తీరనిదని ఆమె అన్నారు.తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జానకమ్మ పాటలకు నివాళిగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాకారులు ఆమె గానశైలిని హృద్యంగా ఆవిష్కరించారని తెలిపారు. ముఖ్యంగా జూనియర్ బాలు విప్లవ్ ఆలపించిన గీతాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయని, యువతకు జానకమ్మ గానం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గాయనీగాయకులు రాజేశ్వరి, శ్రీధర్, సింసన్, యాడమ్స్, చిరంజీవి, రాధిక శర్మ, అర్చన, కృష్ణవేణి, పల్లవి, సుగుణ, వెంకటేశ్వర్లు, ట్రాక్ జోగారావు, ప్రముఖ గాయకుడు రింగ్ సైదులు తదితరులు ఎస్. జానకి ఆలపించిన ఎన్నో మధుర గీతాలను ఆలపించి సంగీత నివాళి అర్పించారు.కార్యక్రమం అనంతరం పాల్గొన్న కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేసి, చేనేత కండువాలతో ఘనంగా సత్కరించారు.సంగీతాభిమానుల విశేష ఆదరణ పొందిన ఈ కార్యక్రమం జానకమ్మ గాన వైభవాన్ని మరోసారి స్మరింపజేస్తూ భావోద్వేగ వాతావరణాన్ని సృష్టించింది.

# అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ ఆసుపత్రిలో మూడు రోజుల ఉచిత యూరాలజీ వైద్య శిబిరం




**తెలుగు గళం న్యూస్ ఉమ్మడి వరంగల్**

వరంగల్ నగరంలోని కొత్తపేట క్రాస్ రోడ్ వద్దగల అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీలలో ప్రత్యేక ఉచిత యూరాలజీ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది.మూత్రంలో మంట,తరచుగా మూత్రం రావడం,మూత్రంలో రక్తం పడటం,కిడ్నీ,వెన్నునొప్పి,కిడ్నీలో రాళ్లు,మూత్రనాళాల ఇన్ఫెక్షన్లు,ప్రోస్టేట్ గ్రంథి వాపు వంటి వ్యాధులతో బాధపడుతున్న బాధితులకు నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు.ఈ శిబిరంలో ప్రముఖ నిపుణులు,కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ జి.మోహన్ చంద్ పాల్గొని రోగులను ప్రత్యక్షంగా పరీక్షించి వ్యాధి తీవ్రతకు అనుగుణంగా చికిత్సా సలహాలు అందించనున్నారు.ఈ శిబిరానికి వచ్చే రోగులకు సంపూర్ణ రక్త పరీక్ష,షుగర్ పరీక్ష,మూత్ర పరీక్ష, క్రియాటినిన్ పరీక్షలతో పాటు వైద్యుల సలహా మేరకు ఉచితంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు అందించనున్నారు.అంతేకాకుండా ఇతర అధునాతన వైద్య పరీక్షలపై 50 శాతం వరకు ప్రత్యేక తగ్గింపును అందుబాటులో ఉంచారు.మూడు రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఉచిత శిబిరం కొనసాగుతుంది.కిడ్నీ వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్యం పొందడం ద్వారా భవిష్యత్తులో వచ్చే తీవ్రమైన ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చని వైద్యులు సూచించారు.ఉమ్మడి వరంగల్ జిల్లా పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఆసక్తి గల వారు ముందుగా చరవాణి నెంబర్ 94598 75555 సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

# ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా మసలుకోవాలి

## కొత్తపల్లి గోరి ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**

ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యతను తీసుకోవాలని కొత్తపల్లి గోరి స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్ హెచ్ ఓ) సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి సూచించారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండల కేంద్రంలోని శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎస్ హెచ్ ఓ ముఖ్య అతిథిగా హాజరై ఆటో యూనియన్ సభ్యులకు నూతన సమకూర్చిన దుస్తులు(యూనిఫాంలు),అధికారిక గుర్తింపు కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్,వాహన నమోదు పత్రాలు (ఆర్సీ), బీమా పత్రాలు (ఇన్సూరెన్స్), కాలుష్య రహిత ధ్రువీకరణ పత్రాలను (పియుసి) ఎల్లప్పుడూ తమ వద్దే ఉంచుకోవాలని స్పష్టం చేశారు.అతివేగంగా,ప్రమాదకర రీతిలో వాహనాలు నడపకూడదని,మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ,ముఖ్యంగా మహిళలు,వృద్ధులు పిల్లలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కోరారు.ఆటో యూనియన్ సభ్యులు క్రమశిక్షణతో ఉంటూ రవాణా వ్యవస్థ మెరుగుదలకు సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రతినిధులు,సభ్యులు,డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్నేహితుడి కుటుంబానికి 'పదో తరగతి మిత్రుల' దాతృత్వం

## తల్లిదండ్రులను కోల్పోయి అనాధలుగా మారిన పిల్లలు స్నేహితుల తరపున రూ. 25 వేల ఆర్థిక సాయం



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

అకాల మరణం చెందిన పాఠశాల మిత్రుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు పదో తరగతి పూర్వ విద్యార్థులు ఉదారత చాటుకుని మానవత్వాన్ని నిలబెట్టారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల పరిధిలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన కంచరకుంట్ల శ్రీనివాస్ రెడ్డి ఇటీవలే గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందారు.ఏడాది క్రితమే శ్రీనివాస్‌రెడ్డి భార్య కూడా మరణించడంతో,తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు.ఈ విషయం తెలుసుకున్న ఆయన బాల్య మిత్రులు తక్షణమే స్పందించారు. 2002వ సంవత్సరంలో శ్రీనివాస్ రెడ్డితో కలిసి పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒక్కటై తమ వంతు సహాయంగా రూ.25,000 ఆర్థిక సాయాన్ని సేకరించి శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు.చిన్ననాటి మిత్రుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమని,ఆ పిల్లలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రజిత, మంజుల, సువర్ణ, మనోహర్, చందు, రాజు, రాజేందర్, భాస్కర్, సంతోష్, అమరేందర్, తిరుపతి ,మధుకర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మాడూరి ముక్తేశ్వర్



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రేగొండ మండల కేంద్రానికి చెందిన మాడూరి ముక్తేశ్వర్ నియమితులయ్యారు.ఈ మేరకు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శిరుప అనిల్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ముక్తేశ్వర్ గతంలో ఆర్యవైశ్య సంఘం రేగొండ మండల అధ్యక్షుడిగా జిల్లా సంఘం నాయకుడిగా అందించిన విశేష సేవలను గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ముక్తేశ్వర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శి పదవిని అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు శిరుప అనిల్,జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు పవిత్రం శ్రీనివాస్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల ఆర్యవైశ్య సంఘ నాయకులకు,బంధుమిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.రాబోయే రోజుల్లో సంఘ బలోపేతానికి,ఆర్యవైశ్యుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

# తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖకు రికార్డు స్థాయిలో ఆదాయం




**హైదరాబాద్, తెలుగు గళం:** తెలంగాణ వాణిజ్యపన్నుల శాఖకు రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. గత నెలలో జీఎస్టీ, వ్యాట్, ప్రొఫెషనల్ ట్యాక్స్ కలిపి రూ.7,865 కోట్లు వసూలైంది. ఇది రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ చరిత్రలోనే అత్యధిక ఆదాయం. గతేడాది జులైతో పోలిస్తే 19శాతం వృద్ధి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు రూ.5,819 కోట్లు వసూలయ్యాయి. జీఎస్టీ వృద్ధి రేటులో హరియాణా తర్వాత రెండో స్థానంలో తెలంగాణ ఉంది. దేశవ్యాప్తంగా జులైలో జీఎస్టీ వసూళ్లు 10శాతం వృద్ధి సాధించగా.. తెలంగాణలో మాత్రం 19శాతం నమోదైంది.

# బిడ్డకు తల్లి ఇచ్చే తొలి కానుక ముర్రు పాలే:కలెక్టర్ రాహుల్ శర్మ



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

తల్లి తన బిడ్డకు ఇవ్వగల మొట్టమొదటి అమూల్యమైన కానుక పుట్టిన వెంటనే ముర్రు పాలు ఇవ్వడమేనని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.శనివారం సమగ్ర జిల్లా కార్యాలయాల సమూహం (ఐడిఓసి) సమావేశ మందిరంలో మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు నిర్వహించనున్న 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు' అవగాహన ప్రచార పత్రాన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచి శారీరక,మానసిక ఎదుగుదలకు తోడ్పడతాయని వెల్లడించారు.అంగన్‌వాడీ,ఆరోగ్య శాఖల సిబ్బంది సమన్వయంతో గ్రామ స్థాయిలో గర్భిణులు,బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టడం,మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడంపై చైతన్యం తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్,జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీనివాస్,పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త యోచన తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్క వరద ప్రాంతాల పర్యటన

## -- ముంపు బాధితులకు భరోసా

### గోదావరి వరదపై అప్రమత్తంగా ఉండాలి -- అధికారులకు మంత్రి ఆదేశాలు


### శాశ్వత గృహాలు నిర్మిస్తాం.. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది





**తెలుగు గళం మంగపేట :**

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) శనివారం జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంగపేట మండలంలో గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వరద బాధితులను నేరుగా కలిసి వారి సమస్యలు తెలుసుకొని ధైర్యం చెబుతూ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంగపేట గోదావరి కరకట్ట నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి, బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన 28 కుటుంబాల 112 మందిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించినట్లు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీసి, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదిలో వరద ప్రవాహం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. నది పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలను అవసరమైతే ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రతి కుటుంబానికి నాణ్యమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు, విద్యుత్, భద్రతతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. బాధితులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ముంపు బాధితులకు శాశ్వత ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, ప్రతి అర్హ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు పునరావాసం, పునర్నిర్మాణ బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ తోట రవీందర్, పంచాయతీరాజ్ స్టేట్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, ఆత్మ కమిటీ జిల్లా చైర్మన్ చిటమట రఘు, మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టిపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మా తండా పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించండి తహాశీల్దార్ సారు"

### తహాశీల్దార్ మాణిక్ రావు కు సామాజిక కార్యకర్త సోనాక్షి వినతి"

### ఇవ్వకుంటే ఎస్టీ కమీషన్ కు వెళ్తా"



**సత్తుపల్లి/వేంసూరు, ఆగస్టు01(తెలుగుగళం) న్యూస్:** ఖమ్మంజిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల చౌడవరం తండాలో సామాజిక యువ ఉద్యమకారిణి వడిత్యా సోనాక్షి గడప గడపకు తిరిగి సమస్యలపై సర్వే చేశారు.అక్కడ నివసిస్తున్న 70 కుటుంబాలకు చెందిన మైదాన ప్రాంత గిరిజన పేదలకు ఇండ్ల పట్టాలు లేవని మా తండా పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించండి తహాశీల్దార్ సారు అంటూ శనివారం సామాజిక యువ ఉద్యమకారిణి వడిత్యా సోనాక్షి వేంసూరు తహాశీల్దార్ జె.మాణిక్ రావు కు వినతిపత్రాన్ని ఇచ్చారు.అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ గతంలో పాలకులు తమ తండాలో ఇండ్ల పట్టాలు ఇచ్చారని అట్టి స్థలాలలో కాలక్రమేనా గూడు లేని గిరిజన పేదలు ఇండ్లు నిర్మించుకొని ఉంటున్నారని



ప్రస్తుతం నివాసం ఉంటున్న అట్టి పేదలకు ఇళ్ల పట్టాలు,హక్కుపత్రాలు ఇప్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.అంతే కాకుండా కల్లూరు సబ్ కలెక్టర్ కు,జిల్లా కలక్టర్ కు, వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.అప్పటికి పట్టాలు, హక్కుపత్రాలు ఇవ్వకుంటే హైదరాబాద్ లోని సీసీఎల్ఏ ను,ఎస్టీ కమీషన్ ను సంప్రదిస్తామని స్పష్టం చేశారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.